సాక్షి
గుంటూరు
మంగళవారం । 19 । నవంబర్ । 2024



వేంకటేశ్వరునికి విశేష పూజలు

జిఎన్‌పాలెం(కర్లపాలెం): గోకరాజు నల్లిబోయి నవారిపాలెంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక పూజలు జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

మంగళగిరి: పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో కార్తిక సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తిక పూజలు



చుండూరు(వేమూరు): చుండూరు మండలం చినపరిమిలోని రామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాయితీపై మినీ ట్రాక్టర్లు



ప్రత్తిపాడు: రాయితీపై రైతులకు మినీ ట్రాక్టర్లు అందించనున్నట్లు ప్రత్తిపాడు మండల ఉద్యాన అధికారి ఎం.బేబి తెలిపారు. కాకుమాను మండలం కొండపాటూరుకు చెందిన కుర్రాకుల ప్రసాద్‌కు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద ట్రాక్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌వో బేబి మాట్లాడుతూ ట్రాక్టర్ ధర రూ.5.25 లక్షలని, ఇందులో ప్రభుత్వ రాయితీ రాయితీ లక్ష ఉంటుందని చెప్పారు. మిగిలిన రూ.4.25 లక్షలు రైతులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు


గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫీజును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించేందుకు తుది గడువును ఈనెల 26 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత విద్యార్థుల పరీక్ష ఫీజును ఈనెల 26లోపు రూ.125 చొప్పున చెల్లించి, నామినల్ రోల్స్‌తోపాటు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. రూ.50 అపరాధ రుసుంతో కలిపి చెల్లించేందుకు డిసెంబర్ 2, రూ.200తో చెల్లించేందుకు డిసెంబర్ 9, రూ.500తో చెల్లించేందుకు డిసెంబర్ 16 వరకు అవకాశముందని వివరించారు.

కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా



గుంటూరు వెస్ట్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఏపీ ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తున్న తమకు ఇంకా చాలీచాలని జీతాలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో పని భారం బాగా పెరిగిందని ఆరోపించారు. తమకు జీతభత్యాలతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కల్పించాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమకు కుటుంబం ఉంటుందని, సెలవులు ఇవ్వాలని విన్నవించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3800 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు162, బ్యాంక్ కెనాల్‌కు 825, తూర్పు కెనాల్‌కు 50, పశ్చిమ కెనాల్‌కు 93, నిజాంపట్నం కాలువకు 209, కొమ్మమూరు కాలువకు 2001 క్యూసెక్కులు విడుదల చేశారు.

దుర్గమ్మకు వెండి కిరీటం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మకు ద్రాక్షారామంకు చెందిన భక్తులు వెండి కిరీటాన్ని సమర్పించారు. ద్రాక్షారామానికి చెందిన కొమ్ముల స్వామినాయుడు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ. 1.30 లక్షలతో 1.300 కిలోల వెండితో కిరీటాన్ని తయారు చేయించి సోమవారం ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ పర్యవేక్షకుడు రమేష్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

పెదకాకానిలో కార్తిక శోభ



పెదకాకాని శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం సోమవారం కార్తిక శోభతో కళకళలాడింది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వేకువనే యజ్ఞాల బావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తిక దీపాలు వెలిగించారు. స్వామిని దర్శించుకున్నారు. సోమవారం ఒక్కరోజే వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ.7,00,000 ఆదాయం లభించినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ కె.బి.శ్రీనివాస్ తెలిపారు.



పెదకాకాని శివాలయంలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అమరేశ్వరునికి పూజలు



అమరేశ్వర ఘాట్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న దృశ్యం

అమరావతి: అమరావతి క్షేత్రంలో వేంచేసిన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాల చాముండేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ సునీల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విశేషాలంకారంలో అమరేశ్వరుడు

త్రికోటేశ్వరునికి రుద్రాభిషేకం



రావిచెట్టు వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో త్రికోటేశ్వరునికి అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారికి విశేష పుష్పాలంకరణ సేవ జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పుష్పాలంకరణలో త్రికోటేశ్వర స్వామి

సిగ్గుచేటని తలంచం!

- పని జరగాలంటే చేయి తడపాల్సిందే
- కాసులిస్తే రికార్డు సరిగా లేకపోయినా డాక్యుమెంట్ సవరణ
- ఈసీ, నకళ్లు, మార్కెట్ వాల్యూ ధ్రువీకరణ ఇలా ప్రతి పనికీ ఓ రేటు
- ఇదీ పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తీరు
- క్రయవిక్రయదారులు బెంబేలు



పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయం

పెదకాకాని: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతిమయంగా మారింది. సిబ్బంది కాసులకు కక్కుర్తిపడుతున్నారు. సిగ్గులేకుండా ప్రతి పనికీ రేటు పెడుతున్నారు. ఫలితంగా క్రయవిక్రయదారులు బెంబేలెత్తిపోతున్నారు. అధికారికి, సిబ్బందికి అనుకూలమైన రైటర్ డాక్యుమెంట్ తెస్తే రికార్డు సరిగా లేకపోయినా పనులు జరుగుతున్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయంలో చలానా చెల్లించినా ఈసీ పొందాలంటే రూ.100 నుంచి రూ.200 సమర్పించుకోవాల్సిందే. నకలు తీసుకోవాలంటే(పబ్లిక్ కాపీ) రూ.200 మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రం కోసం రూ.వంద నుంచి రూ.రెండు వందలు ముట్టజెప్పాల్సిందే. ఫీజు టు ఫీజు షరామామూలే. భూములు, ఆస్తుల కొనుగోళ్ల వ్యవహారంలో ప్రభుత్వానికి చెల్లించే 7.5 శాతం నగదు చలానా రూపంలో చెల్లిస్తారు. ప్రతి డాక్యుమెంట్‌పైనా దాని విలువ ఆధారంగా 0.5 శాతం రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వసూలు చేస్తున్నారు.

రోజూ సిబ్బంది అంతా వాటాలు పంచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. సెల్ఫ్ సవరణలో తప్పులు దొర్లినా, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకపోయినా తప్పులను బట్టి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకూ డిమాండ్ చేస్తున్నారని క్రయవిక్రయదారులు లబోదిబోమంటున్నారు. చివరకు పొలాల తాకట్టు(మార్ట్‌గేజ్) పెట్టి రుణాలు పొందుతున్న రైతులనూ వదలడం లేదు. రూ.500 వరకు లంచం ముక్కుపిండిమరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయంలో నైట్ డ్యూటీ వాచ్‌మెన్ లేకపోయినా పెట్రోలింగ్ రిజిస్టర్‌లో మాత్రం వాచ్‌మెన్ ఉన్నట్లు నమోదు చేస్తున్నారు.

అధికారుల ఫోన్ నంబర్ల బోర్డులేవీ..!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు గానీ, ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులు గానీ కనిపించవు. కనీసం కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న వారి పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన బోర్డూ ఉండదు. ఈ కార్యాలయంలో చివరకు సమాచారం హక్కు చట్టం ప్రకారం సమాచారం కోరినా లంచం ఇచ్చుకోవాల్సిందేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దురుసుగా మాట్లాడుతున్నారు

2023 జూన్ 14న మార్టిగేజ్ పద్ధతిలో రూ.42 లక్షలకు 2870–2023 ఎండార్స్‌మెంట్ డాక్యుమెంట్ ద్వారా రుణం పొందా. తీసుకున్న రుణాన్ని 2024 జూన్ 1న చెల్లు రశీదు డాక్యుమెంట్ నంబరు 2636–2024 ద్వారా చెల్లించా. చెల్లు రశీదు కూడా ఇచ్చారు. కుటుంబ అవసరాల నిమిత్తం ఆ స్థలాన్ని అమ్మకానికి పెట్టగా ఈసీలో తనఖా పెట్టినట్టు చూపిస్తోంది. దీనికోసం చెల్లు రశీదుసు తీసుకుని రెండు నెలలుగా రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణను సంప్రదించగా, నెల పట్టవచ్చు, ఆరు నెలలు పట్టవచ్చు సంవత్సరం పట్టవచ్చు అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఐజీ కార్యాలయంలో తప్పు దొర్లితే తమకేం సంబంధం ఉంటుందని దురుసుగా మాట్లాడుతున్నారు. న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నా.

– షేక్ అల్లావుద్దీన్, గుంటూరు జిల్లా టీడీపీ మైనార్టీసెల్ అధికార ప్రతినిధి

అర్జీల పరిష్కారం సంపూర్ణంగా జరగాలి

- కలెక్టర్ నాగలక్ష్మి
- గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

గుంటూరు వెస్ట్: ప్రజలు అందించే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంపూర్ణంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇక్కడ ప్రజలు అందించే అర్జీలు సీఎంఓ అధికారుల దృష్టిలో ఉంటాయన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ రిపోర్ట్ వెళుతుందన్నారు. ఇక నుంచి అర్జీలను పరిష్కరించే క్రమంలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన నిర్ణయాలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా జిల్లా శాఖాధికారులు ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రతివారం ఒకసారి రివ్యూ చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరం బయటకు వచ్చి దివ్యాంగుల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి వారి సమస్యలను విన్నారు. అనంతరం వచ్చిన 154 ఫిర్యాదులను కలెక్టర్, జేసీ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.



గ్రీవెన్స్ హాలు బయటకు వచ్చి దివ్యాంగుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మద్యం దుకాణం ఇబ్బందిగా మారింది



పెదకాకాని ఏరియా 12వ సచివాలయం సమీపంలోని దేవాలయాలు, గృహ సముదాయాలు ఉండే ప్రాంతంలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం తెరిచారు. మందు బాబులు మా ఇళ్ల ముందే మద్యం సేవిస్తున్నారు. కొందరు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోండి, మద్యం దుకాణం వేరే ప్రాంతానికి మార్పించండి.

– ఎస్.సోమ గోపాల్ రెడ్డి, పెదకాకాని

మాజీ మంత్రి ఆలపాటి నుంచి స్థలాల్ని ఇప్పించండి



20 ఏళ్ల క్రితం గుంటూరు రూరల్ మండలం, పెదపలకలూరులోని 46 ఎకరాల భూమిలో సుమారు 400 కుటుంబాలం నివాసముండేవారం. అక్కడి నుంచి అప్పుడు మంత్రిగా ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తన బలంతో ఖాళీ చేయించారు. ఈ భూమి ఈనామ్ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. ఇప్పుడు కూడా ఆయన ఆధీనంలోనే ఉంది. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

– పిల్లి బాబూరావు, జైభీమ్ కార్మిక సంక్షేమ సంఘ్ అధ్యక్షుడు

పొన్నెకల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మృతిపై విచారణ

పొన్నెకల్లు(తాడికొండ): పొన్నెకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు పాఠశాలలో విచారణ చేపట్టారు. గత నెల 24న పాఠశాలకు రాకుండా ఇంటి వద్దే ఉన్న 9వ తరగతి విద్యార్థి షేక్ సమీర్ అదే రోజు ఈతకు వెళ్ళి నేల బావిలో మృతి చెందాడు. ఆ రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులు 9 మంది కూడా సమీర్‌తో కలిసి ఈత కొట్టారని, వారే మనసులో కక్ష పెట్టుకొని సమీర్‌ను చంపి బావిలో పడవేశారని ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చిన డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు విద్యార్థులను విడివిడిగా విచారణ చేశారు. వారి వద్ద నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. ఘటనపై అప్పట్లో ఎలాంటి ఫిర్యాదు అందలేదంటూ పోలీసులు కేసు నమోదు చేయకుండా ఖననం చేసేందుకు మృతదేహాన్ని అప్పగించారు. సమీర్ తల్లిదండ్రులు పల్నాడు జిల్లా కర్లపూడి గ్రామానికి చెందిన వారు. వారు సమీర్ చిన్నప్పుడే మరణించడంతో పొన్నెకల్లులోని అమ్మమ్మ వద్దే ఉంటూ చదువుకుంటున్నాడు. అమ్మమ్మ వృద్ధురాలు కావడం, వయసు పైబడటంతో ఎలాంటి ఫిర్యాదు చేయకుండా మృతదేహాన్ని అప్పగిస్తే చాలని కోరింది. కానీ తండ్రి తరఫు గ్రామస్తులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. విచారణ జరుగుతున్న సమయంలో పొన్నెకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కూడా హాజరు కావడం, వారు ఇది ముమ్మాటికీ ప్రమాదమేనని, ఇతర చిన్నారుల ప్రమేయం లేదని వినతిపత్రం సమర్పించడంపైనా ఫిర్యాదుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి నివేదికను డీఈఓకు అందజేయనున్నట్లు డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఎంఈఓ ఇందిర, హెచ్‌ఎం జరీనా పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు

ట్యాబ్‌లు వెనక్కి!

- సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టలేషన్ పేరుతో..!
- ఆగస్టులోనే తీసుకున్న ఉపాధ్యాయులు
- ఇంకా విద్యార్థులకు అప్పగించని వైనం

ప్రత్తిపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులూ కల్పించింది. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ చదువులు అవసరమని భావించింది. తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో శాంసంగ్ ట్యాబ్‌లను అందించింది. ఇతరత్రా యాప్‌లు ఓపెన్ అవ్వకుండా విద్యావసరాలకు మాత్రమే ఉపయోగపడేలా పకడ్బందీగా లాక్ సిస్టమ్ ఏర్పాటు చేసింది. దీంతో విద్యార్థులు ట్యాబ్‌ల ద్వారా సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలను నేర్చుకున్నారు. కానీ ప్రస్తుత కూటమి సర్కారు కొత్తవి ఇవ్వకపోగా, ఇప్పటికే ఇచ్చిన వాటిని కూడా వెనక్కు తీసేసుకుంది. ఇన్‌స్టలేషన్ పేరుతో తీసుకుని ఇంకా అప్పగించకపోవడంతో ట్యాబ్‌లకు సర్కారు టాటా చెప్పేస్తుందా? అన్న అనుమానాలు విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో తలెత్తుతున్నాయి.

నాలుగునెలలుగా డిజిటల్ బోధనేదీ?

ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పది తరగతులు చదువుతున్న విద్యార్థులకు గతంలో ఇచ్చిన ట్యాబ్‌లను ఉపాధ్యాయులు వెనక్కు తీసుకున్నారు. ఆగస్టు నెలలో పదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల్లో సీబీఎస్ఈపై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఆ సమయంలో పరీక్ష రాయాలంటే అందులో ఉన్న ఎండీఎం (మొబైల్ డివైజ్ మేనేజ్‌మెంట్) యాప్‌ను తొలగించాల్సిన పరిస్థితి వచ్చింది. తరువాత తొలగించిన యాప్‌ను తిరిగి ఇన్‌స్టాల్ చేసి ఇస్తామని.. చెప్పి ఇన్‌స్టలేషన్ పేరుతో తొమ్మిది, పది తరగతులకు చెందిన సుమారు 120 మందికిపైగా విద్యార్థుల నుంచి మూడు నెలల కిందట ట్యాబ్‌లను పాఠశాల ఉపాధ్యాయులు తీసేసుకున్నారు. యాప్ ఇన్‌స్టాల్ చేసి ఇవ్వకపోగా భద్రంగా ట్యాబ్‌లను అట్టపెట్టెల్లో ప్యాక్ చేసి కంప్యూటర్ గదిలో భద్రపరిచారు. దీంతో విద్యార్థులు ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు.. ఇలా నాలుగు నెలలుగా డిజిటల్ బోధనకు దూరమయ్యారు. ట్యాబ్‌లు ఇలా వెనక్కు తీసుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



అట్టపెట్టెల్లో ప్యాక్ చేసి భద్రపరిచిన విద్యార్థుల నుంచి వెనక్కు తీసుకున్న ట్యాబ్‌లు

తిరిగి ఇస్తాం

ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్.శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇటీవల సీబీఎస్ఈ సిలబస్‌పై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని, అప్పుడు అందులో ఉన్న ఎండీఎం యాప్ అన్ ఇన్‌స్టాల్ చేసి కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఎక్కించారని పేర్కొన్నారు. అందుచేత మళ్లీ ఎండీఎం సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయాలని, లేదంటే ట్యాబ్ మామూలు మొబైల్‌లాగా పనిచేస్తుందని వివరించారు. విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చిన ఉద్దేశం నెరవేరదని, అందుకే ట్యాబ్‌లు తీసుకున్నామని, ఎండీఎం యాప్ ఇన్‌స్టాల్ చేసి విద్యార్థులకు తిరిగి ఇచ్చేస్తామని హెచ్‌ఎం చెప్పారు.

ఇద్దరు హాస్టల్ విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం



సత్తెనపల్లి: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థినుల పట్ల సిబ్బంది దుష్ప్రవర్తన, వేధింపులకు ఆస్కారం లేకుండా చూడాలని హైకోర్టు స్పష్టంగా నిర్దేశించి నాలుగు రోజులైనా గడవకముందే.. సిబ్బంది వేధింపులతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సంచలనం కలిగించింది. సత్తెనపల్లిలోని ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు సంగం అఖిల, అన్నవరపు సనిత వార్డెన్, సిబ్బంది వేధింపులు తాళలేక ఆత్మహత్యా యత్నం చేశారు. అధికసంఖ్యలో డోలో-650 మాత్రలు మింగిన వారు ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో కోలుకుంటున్నారు. ఈనెల 15న మధ్యాహ్నం మిగిలిన అన్నాన్ని రాత్రి వడ్డించడంతో అఖిల, సనిత ప్రశ్నించారు. దీంతో హాస్టల్ వార్డెన్ రాణెమ్మ, వంట సిబ్బంది వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సనితపై దాడికి యత్నించారు. శనివారం హాస్టల్‌కు వచ్చిన తల్లిదండ్రులకు సనిత విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వార్డెన్ రాణెమ్మకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఆదివారం అఖిల, సనితలను వార్డెన్, సిబ్బంది అవమానించడంతో తట్టుకోలేక వారు మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించారు.

ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పులు

- మండలానికొక పాఠశాల చొప్పున ఎంపిక
- ఈనెల 20 నుంచి అమల్లోకి కొత్త పనివేళలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) తీసుకువచ్చిన నూతన టైంటేబుల్ ఈనెల 20వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈమేరకు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఉన్నత పాఠశాలల పనివేళలను సాయంత్రం 5 గంటల వరకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ముందుగా మండలానికి ఒక పాఠశాల చొప్పున పైలెట్ ప్రాజెక్టుగా అమల్లోకి తెస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను సవరిస్తూ ఎస్సీఈఆర్టీ విడుదల చేసిన నూతన టైంటేబుల్‌కు అనుగుణంగా ఆయా మండలాల్లో ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకు మొదటి బెల్‌తో ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నాయి. మొత్తం ఎనిమిది పీరియడ్‌లు ఉంటాయి. జిల్లాలోని మండలాల వారీగా ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలు ఈనెల 20 నుంచి 30 వరకు నూతన టైంటేబుల్ ప్రకారం పని చేయాలని డీఈఓ సీవీ రేణుక ఆదేశించారు. దీనిపై ఈనెల 30న ఉప విద్యాశాఖాధికారులు నివేదిక సమర్పించాలని సూచించారు.

ఎంపిక చేసిన పాఠశాలలివే..

ఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (చేబ్రోలు), శ్రీశారదానికేతన్ గర్ల్స్ హైస్కూల్ (గుంటూరు), ప్రభుత్వ గరల్స్ హైస్కూల్ (గుంటూరు), బీఆర్ జెడ్పీ హైస్కూల్ (ప్రత్తిపాడు), కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ (తుళ్లూరు)తో పాటు దుగ్గిరాల, కాకుమాను, కొల్లిపర, నిడమానూరు, మేడికొండూరు, పెదకాకాని, పెదనందిపాడు, మునగపాడు, నిడుబ్రోలు, తాడికొండ, అంగలకుదురు, తాడేపల్లి, వట్టిచెరుకూరు జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి.

యార్డుకు 43,853 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 43,853 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,919 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 28,536 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

కూలి రేట్ల జీఓ విడుదల చేయాలి



జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

లక్ష్మీపురం: రాష్ట్రంలోని సివిల్ సప్లయిస్ కార్మికుల కూలి రేట్ల జీఓని వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఈ నెల 20 తర్వాత పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్లటానికి కార్మికులు సన్నద్ధమవుతున్నారని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా)వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక గుంటూరు (కలెక్టర్ కార్యాలయం వద్ద) జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసి 11 నెలలు పూర్తి అవుతుందని చెప్పారు. యూనియన్‌తో జరిపిన చర్చల్లో భాగంగా జీఓని వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చిన సివిల్ సప్లయిస్ యాజమాన్యం ఇప్పటి వరకు జీఓని విడుదల చేయకపోవడం సరికాదని చెప్పారు. ప్రావిడెంట్ ఫండ్, పని భద్రతా, ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు మాట్లాడుతూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయిస్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు, దానం, డేవిడ్, కాంతారావు, సురేషు ,బుజ్జి, జాన్ బాబు, శీను , మరియబాబు, నాగరాజు పాల్గొన్నారు.

గుర్తు యువకుడి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 30 నుంచి 33 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు సోమవారం మధ్యాహ్నం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు లేత నీలం రంగు జీన్సు ప్యాంటు, లేత కాషాయ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. స్టేషన్ మేనేజర్ నుంచి వచ్చిన సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు.

మోసపోయాం.. ఆదుకోండి

- ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితుల వినతి
- అర్జీలు స్వీకరించిన ఏఎస్పీ



బాధితురాలి సమస్య ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: నగదు, నగలు తీసుకుని ఓ వ్యక్తి మోసగించినట్లు బాధిత మహిళ వాపోయింది. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ఫిర్యాదు చేశారు. జిల్లా ఏఎస్పీ(పరిపాలన) రమణమూర్తి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. సాధ్యమైనంత త్వరగా బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఏఎస్పీ ఆదేశించారు.

స్థానిక పోలీసులు పట్టించుకోవడం లేదు..

– ఓ మహిళ, అడవితక్కెళ్లపాడు

బ్రాడీపేట 4/1వ అడ్డరోడ్డులోని ఓ డెకార్స్‌లో పనిచేశాను. ఈ క్రమంలో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. నన్ను, బాబుని చూసుకుంటానని నమ్మించాడు. 2016లో అతడితో పెళ్లైంది. నగరాలు, గుజ్జనగుండ్ల, అడవితక్కెళ్లపాడు రాజీవ్ గృహకల్పలో ఉన్నాం. రెండుసార్లు గర్భం దాల్చగా, ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తీయించాడు. క్రమేణా అతను మొదటి భార్యను పరిచేయం చేయగా, అందరం కలిసి ఉన్నాం. భర్త అప్పులు ఉన్నాయని చెప్పడంతో పాతగుంటూరు జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో ఇంటిని విక్రయించాం. ఈ క్రమంలో దఫాల వారీగా రూ.20 లక్షలు, రూ.10 లక్షలు ఖరీదు చేసే నగలు తీసుకున్నాడు. అతడి నుంచి వేధింపులు మొదలయ్యాయి. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇటీవల ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డా. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఫర్వాలేదు. నగలు, నగదు కాజేసి, మోసగించిన వ్యక్తిని విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

సంబంధాలు రావడంలేదు..

రామిరెడ్డితోట సమీపంలోని రైల్వేట్రాక్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురు ఏరియాల్లో విచ్చలవిడిగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. దీంతో సాయంత్ర వేళల్లో స్థానిక మహిళలు, పిల్లలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. గతంలో వ్యభిచారులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వ్యభిచారం విచ్చలవిడిగా జరుగుతుంది. దీంతో ఇక్కడ ఉంటున్న వారిపై తప్పుడు ప్రచారాలు సాగుతున్నాయి. పిల్లలకు పెళ్లి సంబంధాలు రావడంలేదు. దీంతో వేరే ప్రాంతానికి తరలివెళ్తున్నారు.

– సామాజిక మహిళా కార్యకర్త, రామిరెడ్డితోట.

రైల్వేలో ఉద్యోగాల పేరుతో మోసం..

ఓ భార్యాభర్తలు, మిత్రులు ఏకమై ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికేవారు. చాలా కాలం వారిని నమ్మలేదు. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాల అపాయిమెంట్‌లు చూయించారు. ఈ క్రమంలో వాట్సాప్ వాయిస్ మెసేజ్‌లు పంపించేవారు. ఆఖరికి ఉద్యోగాలు వచ్చాయని, విచారణ పేరుతో నమ్మబలికారు. విజయవాడకు చెందిన వ్యక్తులతో ఫోన్‌లో తమతో మాట్లాడించారు. తమ పేర్లతో రైల్వే అపాయింట్‌మెంట్‌లను సృష్టించారు. దీంతో రైల్వే అధికారుల సంతకాలు, స్టాంప్‌లు, జీఓలతో మోసగించారు. దాదాపు రూ.8 లక్షల వరకు చెల్లించాం. డబ్బులు అడిగితే సరైన సమాధానం లేదు. న్యాయం చేయగలరు.

– ఎం.సుబ్బారావు, కె.విజయలక్ష్మి, భారత్‌పేట, పోస్టల్ కాలనీ.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **4,000**

మోడల్ ధర రూ. **3,500**

తుళ్లూరు స్టేషన్‌లో అనిల్‌కుమార్ విచారణ

తాడికొండ: తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను విచారణ నిమిత్తం సోమవారం తీసుకొచ్చారు. మంగళగిరి కోర్టు ఆదేశాల మేరకు.. విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించి తిరిగి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబంపై దాడి

ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ బెదిరింపులు



బెల్లంకొండ: మా ప్రభుత్వం వచ్చింది... మా వాళ్లే అంగన్‌వాడీ ఉద్యోగం చేయాలి.. మర్యాదగా ఉద్యోగానికి రాజీనామా చేయి.. లేకపోతే నీ అంతు చూస్తాం.. అంటూ అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబంపై దాడికి దిగిన ఘటన మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితురాలు మన్నెసుల్తాన్‌పాలెం అంగన్‌వాడీ కార్యకర్త మాటూరి బుజ్జి తెలిపిన వివరాలు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగానికి రాజీనామా చేయాలని గ్రామానికి చెందిన నాయకులు వేధింపులకు గురి చేస్తున్నా రు. ఇప్పటివరకు నాలుగుసార్లు కలెక్టరేట్‌లో ఆమెపై ఫిర్యాదు చేశారు. స్థానిక ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి విచారణ చేపట్టారు. ఎన్నిసార్లు విచారణకు వచ్చినా తనపై లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందలేదు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రెండు రోజుల నుంచి బెదిరింపులకు గురిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఇంట్లోకి వచ్చి ఉద్యోగానికి రాజీనామా చేస్తావా లేదా అంటూ అంగన్‌వాడీ కార్యకర్త, ఆమె భర్త చిట్టిబాబుపై దాడికి పాల్పడ్డారు. విషయాన్ని ఫోన్ ద్వారా బెల్లంకొండ ఎస్ఐకి తెలియజేయగా కానిస్టేబుల్‌ను పంపారు. వారి సహాయంతో పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యా దు చేసింది. టీడీపీ నాయకుల నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకుంది. అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబం తమపై దాడి చేశారంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదు లు విచారిస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ



స్కూటీపై వెళ్తున్న నిందితుల సీసీ ఫుటేజ్ దృశ్యం

తెనాలిరూరల్: ఒంటరిగా నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న వృద్ధురాలిని వెంబడించి మెడలోని బంగారం గొలుసును గుర్తు తెలియని యువకులు అపహరించుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాలు.. మారిస్‌పేట రావివారివీధిలోని ఓ ఇంట్లో సుగ్గుల సరస్వతి(85) అద్దెకు ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గుడికి వెళ్లి తిరిగి వస్తున్న ఆమెను ఇద్దరు యువకులు స్కూటీపై వెంబడించారు. ఇంటి వద్దకు వచ్చిన ఆమెను అడ్రస్ అడుగుతూ ఆమెను మాటల్లో పెట్టి మెడలోని బంగారం గొలుసును తెంచుకుని పరారయ్యారు. ఊహించని ఈ ఘటన నుంచి తేరుకున్న ఆమె కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకునే సరికి దుండగులు వెళ్లిపోయారు. దీంతో బాధితురాలు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పెదకాకాని: ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో బంగారం గొలుసు లాక్కొని వెళ్లిన ఘటన కొప్పురావూరు శివార్లలో చోటుచేసుకుంది. వివరాలు.. కొప్పురావూరు గ్రామ శివార్లలో నిర్మించిన క్యాపిటల్ అపార్ట్‌మెంట్‌లో శ్రీవాని కుటుంబం నివసిస్తోంది. సోమవారం ఆలయానికి తీసుకెళ్లేందుకు భర్త బైక్‌పై వస్తున్నట్లు ఫోన్ చేసి చెప్పడంతో నడుచుకుంటూ ఎదురు వెళ్లింది. కంతేరు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి సమీపంలోకి వెళ్లే సరికి స్కూటీపై వెళుతున్న వ్యక్తి ఆమెను దాటి ముందుకు వెళ్ళాడు. నిర్మానుష్యంగా ఉండటం , ఆ సమయంలో అక్కడ ఎవరూ కనిపించకపోవడంతో స్కూటీని వెనక్కి తిప్పాడు. ఒంటిరిగా నడుచుకుంటూ వస్తున్న మహిళలను ఫోన్ కావాలని అడిగి ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసు లాక్కొని పరారీ అయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం సీఐ టి.నారాయణస్వామి తెలిపారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

- గ్రామ, పట్టణ స్థాయిలో పార్టీ కొత్త కమిటీలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు హాల్‌లో నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ గతంలో ఉన్న జిల్లా పార్టీ, మండల పార్టీ కమిటీలు, జిల్లా మండల అనుబంధ విభాగాల కమిటీలు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షుల కమిటీలు, గ్రామ కమిటీలను రద్దు చేస్తూ వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తామని అన్నారు. క్లస్టర్ల జేసీఎస్, జిల్లా మండల అధ్యక్షులు పూర్తిగా రద్దు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతానికి జిల్లా పార్టీ కమిటీకి సంబంధించి ప్రతి నియోజకవర్గం నుంచి ఒక ఉపాధ్యక్షులు, ఇద్దరు ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఇద్దరు యాక్టివిటీ సెక్రటరీ, ఒక అధికార ప్రతినిధి పేర్లను పంపవలసినదిగా నియోజకవర్గాల సమన్వయకర్తలను ఆయన కోరారు. 26 జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను కూడా త్వరలో నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, షేక్ నూరి ఫాతిమా, దొంతిరెడ్డి శంకర్ రెడ్డి (వేమారెడ్డి), వనమా బాల వజ్రబాబు, బాలసాని కిరణ్ కుమార్, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాలయ రాజనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు సిద్ధం కావాలి



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సమరశీల పోరాటాలకు సిద్ధమవుతున్నట్టు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. మహాసభకు జిల్లా నాయకుడు మధు అధ్యక్షత వహించారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షునిగా నాగేశ్వరరావు

అనంతరం ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మధు, కోశాధికారిగా కాసా గోపికృష్ణ, ఉపాధ్యక్షులుగా దాసరి హేమంత్, రాజా, సహాయ కార్యదర్శులుగా వాగ్య నాయక్, అభిషేక్, బి.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మామ, బావ అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

నగరంపాలెం: మామ, బావ అసభ్య ప్రవర్తనపై కోడలు సోమవారం ఫిర్యాదు చేసింది. మామ వక్రబుద్ధిపై గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించింది. ఈ సందర్భంగా బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడారు. గుంటూరు రూరల్ గ్రామానికి చెందిన యువతికి తుళ్లూరు మండలానికి చెందిన యువకుడితో గతేడాది నవంబర్‌లో పెళ్లైంది. మొదట్లో కాపురం సజావుగా సాగినా అత్తారింటి నుంచి వేధింపులు మొదలయ్యాయి. అధిక కట్నం తేవాలని ఒత్తిడి తీసుకొచ్చేవారు. భర్త విజయవాడలోని ఓ కారు షోరూంలో పనికి వెళ్లేవాడు. ఇదే అదునుగా భావించిన మామ కోడలిపై కన్నేశాడు. ఒంటిపై చేతులేస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై భర్త, అత్త దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదు. ఆఖరికి బావ కూడా వెనుక నుంచి పట్టుకునేవాడు. వరస ఘటనలపై ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించేవారు. తల్లిదండ్రులకు దృష్టికి తీసుకెళ్లగా, పుట్టింటికి తీసుకొచ్చారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. కట్నంతోపాటు శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన భర్త, అత్త, మామ, బావపై చర్యలు తీసుకోవాలని అర్జీలో కోరినట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



ప్రకృతి వ్యవసాయంపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: జిల్లా రైతాంగం ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో రైతు సాధికార సంస్థ, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయంపై రూపొందించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యాజమాన్య దీపిక, ప్రకృతి వ్యవసాయ సంక్షిప్త మార్గదర్శిని ఈ రెండు పుస్తకాలు రైతులకు బాగా ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని 80 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతుందని వివరించారు. ఈ పుస్తకాలను జిల్లాలోని 201 గ్రామాల్లోని గ్రామ సంఘాలకు పుస్తకాలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

గుంటూరు వెస్ట్: ప్రజలకు ఎనలేని సేవలందిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. అందుకే 26 జిల్లాల కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ 3 షిఫ్టుల్లో ఒక్కొక్కరు 8 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వై.శివ శంకరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ బాబు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ వెంబడి గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ సమీపంలో గుర్తుపట్టని మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. గుంటూరు జీఆర్‌సీ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలోని పోల్ నంబర్ 425/30ఎ, మరియు 425/32బి పోల్ మధ్య రైల్వే ట్రాక్ పక్కనే మృతదేహం పడి ఉందని, ఉదయం వచ్చిన సమాచారం మేరకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతుడి వయస్సు 35-40 మధ్య ఉండవచ్చని, మృతుడి ఒంటిపై తెలుపు వంకాయరంగు గీతలు కలిగిన ఫుల్‌హ్యాండ్ చొక్కా, నలుపురంగు ప్యాంటు, హాఫ్‌హ్యాండ్ బనీన్ ధరించి ఉన్నాడని, ఎవరైనా ఈ మృతదేహాన్ని గుర్తిస్తే 8328018787 లేదా 0863-2220738కి ఫోన్ చేయాలని ఆయన కోరారు.